


హెలెన్ మళ్ళీ ఉత్తరం వ్రాసింది. త్వరగా వైజాగ్ వచ్చి, తనని పెళ్ళాడెయ్యమని. ఇందాకా, అసలు పెళ్లి గురించే ఓ స్థిర నిర్ణయానికి రాని నా మనసు, ఒక్కసారిగా స్థంభించిపోయిందా ఉత్తరం చదవగానే.

వైజాగ్‌లో పి.హెచ్.డి. చేస్తున్నపుడు, ఎం.ఏ ప్రివియస్ స్టూడెంట్‌గా ఉన్న హెలెన్‌తో నా పరిచయమైంది. నా రూందగ్గరలోనే వాళ్ళిల్లు. ఎప్పుడేనా ఏదేనా పాఠం చెప్పమని వచ్చేది... అదయినా ఓ అరగంటసేపు. ఆ క్లాస్సేపూ ఆమె శిష్యురాలు. నేను గురువును. అంతకుమించిన "రొమాంటిక్" కబుర్లుగానీ, పాఠాలుగానీ మా మధ్య జరగలేదు. కానీ, ఐదారుమార్లు హెలెన్ ఏవో కబుర్లు చెప్పటానికి ప్రయత్నించటం మాత్రం నాకు బాగా తెలుసు. ఆమె ఆ "మూడ్" లోకి రాగానే, నేనే సంభాషణ తెంచేసి, బయట పనివుందని తప్పుకునేవాణ్ణి. నేను ప్రవరాఖ్యుడినని చెప్పుకోను. నాలోనూ కోరికలున్నాయి. ఆడపిల్ల కళ్ళభాషలోని భావాలు అర్థం అవుతాయి. అయితే, మా ఇంటి ఆర్థిక పరిస్థితులు నన్నా అందమైన స్వాప్నిక లోకంలో విహరించనివ్వకుండా, వాస్తవాలని అనుక్షణం గుర్తుకు చేస్తుండటం మూలంగా, నా యూనివర్సిటీ లైఫ్ కేవలం యంత్రంలా సాగిపోయిందేగానీ, గుర్తుపెట్టుకోదగిన "కథలనూ" "స్మృతు"లనూ మిగల్చలేదు.

నాకంటే ఏణ్ణర్థం పెద్దదైనఅక్కయ్యకింకా పెళ్ళికాలేదు. ఆమె వయసింకా పదిహేడేనని అమ్మ, నాన్న ప్రతి పెళ్ళి కొడుకుతోనూ, అతగాడి పెద్దలతోనూ చెబుతూనేవున్నారు. నా తర్వాత చెల్లాయి బి.ఎస్.సి. చదువుతోంది. దాని వయసు పధ్నాలుగే (అంటుందమ్మ!) తర్వాత ఇద్దరుతమ్ముళ్ళు. ఒకడు ఇంటర్మీడియెట్, మరొకడు ఫోర్తుఫారం.

మా అందరికంటె పెద్దవాడైన, అన్నయ్య, కాకినాడలో బి.ఇడి టీచరుగా పనిచేస్తున్నాడు. వాడికి ముగ్గురు పిల్లలు. ఆరునెలలకోసారి "దానం" లాగా వచ్చే జీతాలు ... తల్చుకుంటేనే భయం వేస్తుంది వాడి సంసారం!

నాకు చదువు పూర్తయి ఏడాది నిండింది! కానీ ఉద్యోగం వచ్చే ఆశ మాత్రం మరో ఏడాదికూడా కనిపించటంలేదు! ఇంటర్వ్యూలకు వెళ్ళి

రావటం, అదనపుఖర్చు తప్ప, మరో ఆదాయం లేదు.

ఈ పరిస్థితుల్లో హెలెన్ ఉత్తరం వ్రాసింది వారంరోజుల క్రితం.

"నీకెన్ని ఉత్తరాలు వ్రాసినా, సరిగాజవాబివ్వవు. ఇచ్చిన ఒకటి రెండు జవాబులూ "డైరీ" గా "ఇ.షే" "అ.షే" అన్నట్లుంటే ఏంచావను!

"వన్‌వే ట్రాఫిక్" అన్నా ఫర్వా లేదు. నీ గంభీరత, నాకు చాలా చాలా నచ్చింది. ఈ మాటే చాలా మార్లు చెప్పాన్నీకు. నీ జవాబు విన్నాను "యూనివర్సిటీలో అయిన పరిచయా లన్నీ ప్రణయాలుగా, పెళ్లిళ్లగా మారే పక్షంలో, యూనివర్సిటీనుంచి బయట పడే సగటు విద్యార్థినీ, విద్యార్థు లంద రికీ, లెక్కకు మించిన...బాధ్యతలూ వుంటాయేమో!" అని.

కావచ్చు నేను నిన్నే పెళ్ళాడాలని పట్టుబట్టి కూర్చున్నాను. నిజానికి మా బావ... ఫారిన్‌రిటర్న్డ్ డాక్టరు... వచ్చి కూర్చున్నాడు. నీ కంటె అంద గాడు...నీకంటె పెద్దడిగ్రీ వున్న వాడు...ఏ క్షణాన నేను "ఊ" అంటే ఆక్షణాన్న నను "మారేజ్" చేసేసు కుంటాడు.

మీ ఇంట్లో నిప్పును కడిగే ఆచార మని చెప్పావు. పోనీ వాటితో నాకు పనేమిటి? మనం మీ వాళ్ళకు దూరంగా వుందాము...నీకు ఉద్యోగం లేదనీ... మీనాన్నగారి సంపాదనమీద ఆధార పడటం బాధ అనీ పోయినసారి ఉత్త రంలో వ్రాశావు.

పిచ్చిరాజూ!

ఉద్యోగం లేక పోతేఏం? నాకు డిగ్రీ వుంది...నీకూ ఉంది. ఇద్దరం కలిసి ట్యుటోరియల్ కాలేజి పెడదాము... చిన్న కాన్వెంటు పెడదామా... అవేవీ కాకపోతే కూలీనాలీచేసి బ్రతకలేమా?

ఈ రోజుల్లో కులాలూ, మతాల దేమిటి? మనిద్దరం పైసాపైసా కూడ బెట్టి-మీ అక్క చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చేసే ద్దాం. డబ్బుకు భూతాలైనా జడుస్తాయి. మనుషులదోలెక్కా? ప్రేమమీద నమ్మ కం వుండాలేగానీ సాధించలేనిదేది?"

అంటూ. ఆ సుదీర్ఘమైన ఉత్తరం నాకు హెలెన్ పట్ల అపరిమితమైన జాలిని కలిగించింది. చదువులతో, షోకు లతో పెరిగినమాశరీరాలు "కూలీనాలీ"కి వంగుతాయా? సినిమాలలో, అయితే, ఆ హీరో- నిర్మాతలు కుట్టించిన (అందమైన అతుకులు వేయబడిన) ఖరీదైన సూటుతో-రిక్షా తొక్కుతాడు. నాకెవరిస్తారు మామూలు పాంట్లయినా? మననుకూడా "కూలి-నాలి" కి ఒప్పు కోదు. ఇక మిగిలింది, హెలెన్ సంపా దన. పెళ్ళి అయ్యేంతవరకూ చాలా మంది అమ్మాయిలలో కనిపించే ఆక ర్షణ, చలాకీతనం... పెళ్ళయ్యాక, బెలూన్‌లోనుంచి గాలి తీసివేసినట్లు ఒక్కసారిగా మాయమైపోతుంది! హెలెన్ మాత్రం, అందుకు భిన్నమైం దని ఎందుకనుకోవాలి? వీధికి ఆరు ట్యుటోరియల్ కాలేజిలూ, కాన్వెంటులూ వున్న ఈ రోజులలో, నేనూ, హెలెన్ ట్యుటోరియల్ కాలేజిమీద లక్షలు సంపాదించ గలమనుకోవడం భ్రమకాక మరేమిటి? హెలెన్ ఆవులింతలలో, చదువుకోసం వచ్చిన పిల్లలు- వచ్చిన చదువు మరిచిపోతారు. మేమిద్దరం గాలి భోంచేసి, తొలివలపుల మెరపు విరిగి, ఒకరినొకరు తిట్టుకుని, ప్రేమ పెళ్ళిళ్ళన్నీ ఇంత అధ్వాన్నంగా వుంటా యని, రోజుకొకసారి మా చుట్టుప్రక్కల వారికీ, ప్రపంచానికీ ఋజువుచేస్తాము. అది నాకిష్టంలేదు. ఇవన్నీ విపులంగా వ్రాశేసాను... ఇక ఇంతటితోనైనా మంకుపట్టు (ప్రాణాలు తోడెయ్యకుండా) వదిలిపెడుతుందేమోననే ఆశతో...

ఊహూ!. హెలెన్ రాబర్ట్ బ్రౌన్ చెల్లెలు!

"నీకిన్ని భయాలూ - సందేహాలూ వున్నాయి...సరేనేచెప్పినట్లుచెయ్యి. నీకు ఉద్యోగం వస్తుంది. హైద్రాబాదులో, మా మేనత్తకూతురు రీటా...ఫలానా "జాబ్" చేస్తోంది. ఆమె భర్త సుబ్రహ్మణ్యం! వాళ్ళిద్దరిదీ "ఇంటర్ కాస్ట్ లవ్‌మారేజ్!" ఒక్కసారివెళ్ళి వాళ్ళిద్దరిదగ్గరా రెండు రోజులుండిరా! ఎంచక్కటి దాంపత్యమో అర్థమౌతుంది.

వాళ్లిద్దరూ తామిద్దరూ అలా "మేరేజ్" చేసుకోవటంతో ఆగక, ఓ ఆదర్శ ప్రాయమైన సాంఘిక సేవాకార్యక్రమం ఒకటి చేపట్టారు. ఇద్దరూ కలిసి "ఆదర్శ వివాహ సంస్థ" అని ఒకటి స్థాపించారు. ఓ పత్రిక నడుపుతున్నారు అదేపేరుతో. కులాంతర, మతాంతర వివాహాలుచేసు కొనే వారి ఫొటోలు ఆ పత్రికలో ప్రచు రిస్తారు. మంచిప్రచారం ఇస్తారు. అంతే కాదు-అలా ఆదర్శవివాహాలు చేసుకున్న దంపతులకు—తమ సంస్థ తరఫున కొన్ని గ్రాంట్సు తెప్పించి, ఉద్యోగాలు చూపిస్తున్నారు. స్వంతఇల్లు కట్టుకునేం దుకు ప్లాటు ఇస్తారుట (తర్వాత)! అలా చాలామంది లాభంపొంది వున్నారనీ... నన్నూ చేసుకోమనీ-మా రీటా వ్రాసింది నిన్ననే.

వెళ్ళి-ఇలా "ఫలానా హెలెన్‌నుచేసు కోదలిచానని చెప్పు! చాలు. నిన్నునెత్తిన పెట్టుక జాబ్ ఇప్పిస్తారు...అయితే మన పెళ్ళి ఖాయం చేయాలిసుమా!"

అదీ ఈరోజు వచ్చిన ఉత్తరం సారాంశం. అందుకే నా శరీరమూ, మనసూ ఒక్కసారిగా బిగుసుకు పోయాయి. ఈరోజు నాక్కావలసింది ఉద్యోగం! ఉద్వాహం కాదు. కానీ— ఎంతప్రయత్నించినా రాని ఉద్యోగం— హెలెన్ చూపిన మార్గంలో వచ్చేటట్ల యితే...ప్రయత్నం చేయకూడదా?

కోడలూ, కోడలి కులమూ చేదుగానీ, కోడలిద్వారా సంక్రమించే ఉద్యోగమూ, కోడలి సంపాదనలోని డబ్బూ, చేదుగా వను కుంటాను అమ్మా, నాన్నలకు.


హెలెన్ మేనత్త కూతురిమీద గానీ, ఆమె మొగుడి మీదగానీ, వాళ్ళదాంపత్య అన్యోన్యత మీదగానీ, నాకు స్పెషల్ ఇంట్రెస్ట్ ఏమీలేదు. కానీ, హైదరాబాదు లోనే, ఓ సంబంధం వుందనీ, ఆయనకు ఒక్కర్తే కూతురనీ, ఆయనగారుఘటనా ఘటనసమర్థుడనీ ... ఆయనకూతుర్ని పెళ్ళాడితే, అల్లుడికి పెద్ద ఉద్యోగమే ఇప్పించగలడనీ, తప్పక వెళ్లిచూడమనీ, అన్నయ్య, నాన్నకు, నా గురించిఉత్తరం వ్రాశాడు నిన్ననే!

చూద్దాం. ఏదో ఓరాయి... అయితే అలా, లేకుంటే ఇలా. బయల్దేరాను.

హెలెన్ మేనత్త కూతురు మొగుడు సుబ్రహ్మణ్యాన్ని కల్సుకున్నాను ముందస్తుగా...

రీటాకు, హెలెన్ ఉత్తరం వ్రాసిందట నాగురించి "స్పెషల్ కేర్" తీసుకోమని. చాలా ఆదరంగా ఆహ్వానించింది రీటా.

సుబ్రహ్మణ్యం, క్షణకాలం నావేపు పరిశీలనగాచూసి. ఇల్లెగిరి పోయేలానవ్వి (ఎందుకో అర్థంగాలేదు!), నా భుజం చరచి "వెల్.వెల్. నాలానే మీరూ కులాంతర వివాహం చేసుకో బోతున్నారన్న మాట! చాలా సంతోషం. మీరు మరెక్కడా వుండొద్దు. ఈ రెండు రోజులూ మాఇంట్లోనే వుండండి. జాబ్ విషయం కదూ! అదినాకు వదిలెయ్యండి. హెలెన్ను, మీరు ఇలా పెళ్ళాడటమూ ఆలా మీ ఫోటోలు మా "ఆదర్శవివాహాలు" మాసపత్రికలో రావటమూ, ఆ తర్వాత మీ ఇద్దరికీ మంచి ఉద్యోగాలు రావటమూ, మీరూ మాలానే చక్కటి సంతోషకరమైన వైవాహిక జీవితం గడపటమూ,నిముషాలమీదజరిగిపోతాయి.




ఆ తర్వాత మీరూ, మీలాటి మరికొందరు ఆదర్శయువతీ యువకులను-ఐమీన్...ఆదర్శాలు మనసులోవున్నా, పైకి ధైర్యంగా ఆచరణలో పెట్టుకోలేని వారికి-ప్రోత్సాహం ఇవ్వాలి... "చెయిన్ సిస్టమ్" అని ఈమధ్య స్టీలు గిన్నెలు ట్రాన్సిస్టర్స్, వగైరా అన్నిటికీ ఒక పద్ధతి వచ్చింది మీరుగమనించేవుంటారు. మీరు, ఓ వస్తువుకోసం కొంతడబ్బు కట్టగానే, వెంటనే పోస్టులో మూడుటిక్కెట్లు వస్తాయి... అవి మీ మిత్రులు ముగ్గురికి అమ్మితే...వారిముగ్గురికి, ఒక్కొక్కరికి మూడు ప్రకారం తొమ్మిది టిక్కెట్లు వస్తే..."

"ప్లీజ్—మీరుకాస్త రెస్ట్తీసుకోండి. బయటనుంచి ఎండలోవచ్చారు...రాగానే నేను తగులుకున్నానుపాపం.!" అంటూ అతగాడిమాటలకు అడ్డంపడ్డాను. లేకపోతే, ఆ చెయిన్స్కీమ్ఏదో నాబుర్ర లోనే గొలుసులు తిప్పేసేలావున్నాడు...

"ఎస్..ఎస్..రీటా.. : మనం సాయంత్రం ఐదుగంటలకల్లా సభకు వెళ్ళాలి. ఈరోజు సభకు ఇద్దరు ముగ్గురు ప్రముఖ రాజకీయనాయకులను కూడా ఆహ్వానించాం. గుర్తుందా? అన్నట్లు మీకీ సభ వివరాలు చెప్పలేదుకదూ?"

"మా 'ఆదర్శవివాహసంస్థ' కుప్రభుత్వంతో ఏలాటి సంబంధంలేదు. రాజకీయాలతోగానీ, రాజకీయపార్టీలతోగానీ, రాజకీయనాయకులతోగానీ, మరేమితా తత్వాలతోగానీ, గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయిలోని గొప్పగొప్ప వ్యక్తులతోగానీ, ఏలాటి, ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు లేవు." గుక్కతిప్పుకోవటాని క్కాబోలు ఆగాడు సుబ్రహ్మణ్యం.

క్షణకాలం ఈ దేశంలో వున్నానా, మరెక్కడేనా వున్నానా?- అన్న అనుమానం నన్ను తొలిచేసింది. ఎంచేతంటే పంచాయితీరాజ్ లో- సొంతగ్రామంలో, స్వంత ఇంట్లో హాయిగా వుండటాని క్కూడా గ్రామరాజకీయాలు - ప్రవేశించే ఈ రోజుల్లో ..సాంస్కృతిక,చలనచిత్ర, నాటకరంగ, చిత్రలేఖక, రచనారంగాలలో కూడా అదృశ్యహస్తంగా, బోలెడన్ని పాలిటిక్స్ దాగివున్న ఈరోజులలో-సుబ్రహ్మణ్యం చెప్పేరకం సంస్థ వుందంటే-ఇంకా బ్రతికి వున్నదంటే ఇదేదో "ఎయిత్ వండర్"అయివుండాలి! నా ఆలోచనలు చెదరగొడుతూ సుబ్రహ్మణ్యం గొంతుక ఖంగుమంది.

"అంచేత...ఎంతోకష్టంమీద "ఆదర్శవివాహాలు" జరిపిస్తున్నాం. "ఆదర్శవివాహాలు" పత్రికనడుపగలుగుతున్నాం పద్మవ్యూహంలోకి జొరబడే అభిమన్యు

డిలా ముందుకుసాగుతున్నాం. కదురీటా? అహ్హహ్హ..." రీటా! ఏదోపనిలోవుండే "ఎస్. ఎస్ డాళింగ్!" అంది లోపల్నుంచే. నేనూ తలూపాను. "ఈరోజు కావాలనే రాజకీయవాదుల్ని ఆహ్వానించాను. ఎందుకో తెలుసా... ఒక రిద్దరు మహానాయకుల అండవుంటే- ఈసంస్థ త్వరగా అభివృద్ధి సాధించగలదని అనిపించింది..."

నేను మాట్లాడలేదు. ఆ సత్యాన్ని ఇప్పటికైనా సుబ్రహ్మణ్యం గుర్తించినందుకు సంతోషం కలిగింది లోలోపల.

మధ్యాహ్నం హాయిగా విశ్రాంతితీసుకున్నాను. సాయింత్రం ఐదుగంటలకు అందరం సభకువెళ్ళాం. శ్రోతలు చాలా మందే వచ్చారు. దాన్నిబట్టి, సుబ్రహ్మణ్యానికి సిటీలో కొంత బాగానే పలుకుబడి వుందనిపించింది.

సుబ్రహ్మణ్యం-డయస్ దగ్గరనిల్చున్నాక, అతగాడు నేనిందాకా చూచిన మనిషిగాక,మరోమనిషేమోననిపించింది. చాలా ఎమోషనల్‌గా స్పీచ్ ఇచ్చాడు.

కులాలూ, మతాలూఅన్నవి సృష్టిలో లేనే లేవన్నాడు. అవి మనుషులు "అహం" కొద్దీ,"జులుం" కొద్దీ సృష్టించుకున్న తెరలు, పొరలు, అన్నాడు. దాంపత్యజీవితం స్వర్గం కావటానికీ, నరకం చేసుకోవటానికీ ముఖ్యం, కులం మతంకాదు, మనసూ_మమతా అన్నాడు. ఉదాహరణగా సద్బ్రాహ్మణ వంశంలో పుట్టిన తనూ, క్రిస్టియన్ అమ్మాయి అయిన రీటా, వివాహమాడి, ఎంచక్కటి ఆదర్శ ప్రాయమైన జీవితం గడుపుతున్నారో.. పదిమందికి మార్గదర్శకులయ్యారో చూడమన్నాడు. సకులాలదంపతులు ఇంతటి ఆత్మతృప్తి ఏనాడూపొందలేరన్నాడు. మధ్యలో ప్రక్కనేకుర్చీలో కూర్చునివున్న రీటాకేసిచూసి "కదూ రీటా?" అన్నాడు. ఆమె తలూపి, అందంగా, తృప్తిగా, గర్వంగా నవ్వింది.

ఆ క్షణంలో వాళ్ళిద్దరికేసి చూచిన ఎవరికేనా అనిపిస్తుంది. వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరుపుట్టారనీ.. ఆ మాటే కొందరు శ్రోతలుగుసగుసగా అన్నారు.

ఆ తర్వాత రీటా మాట్లాడింది. ఆమె కూడా చాలావివరణఇచ్చింది కులాంతర వివాహాలుగురించి. మొత్తంమీద ఇద్దరికిద్దరూ మంచివక్తలూ, సరైన జంటఅనిపించింది, నాక్కూడా. నేనూ హెలెన్ ఇలాగే వుండగలమా? అన్న ఆలోచన కూడా వచ్చిందాక్షణంలో!

ఆ రాత్రి ముగ్గురం కలిసిఒక టేబిల్ మీద భోజనంచేశాం. చాలా సరదాగా, "జోక్స్" వేసుకుంటూ, నేను పరాయివాడినన్న భావం రాకుండా, రానివ్వకుండా గంటలు నిమిషాలుగా దొర్లించేశారు వాళ్లిద్దరూ! నాకు కేటాయించిన రూంలో హాయిగా నిద్రపోయాను.

తెల్లారి లేచి, ఇకనాన్నకు సమాధానం చెప్పాలి గాబట్టి...మొక్కుబడిగా, ఆ "సంబంధం" వాళ్లింటికి వెళ్లాను. వెంట పెద్దలెవరూ రాకుండా, ఒంటరిగా వచ్చిన నన్ను చూసి, ముందుకాస్త తికమక పడ్డారు. "మీపెద్దవాళ్ళు కూడా వచ్చి వుంటే...ఏకంగా ముహూర్తాలు పెట్టుకుందామనుకున్నామండీ!" అన్నాడు పిల్లతండ్రి...

"అతగాడు మాత్రం పెద్దల మాట కాదంటాడా! బంగారు పిచ్చుకలాటి మామగారినీ, కామధేనువులాటి ఉద్యోగాన్నీ వదులుకుంటాడా ఏమిటి? ఈ రోజుల్లో పెళ్లిచూపులకు ఇలాగే, ఒక ఫ్రెండును వెంటబెట్టుకు వస్తున్నారు కుర్రాళ్ళు..ఈ కుర్రాడు ఇంకా సింపుల్. ఒక్కడేవచ్చాడు. అహ్హహ్హ!" అంటూ "సీన్" "కామెడీ" గా మార్చేశాడు మధ్యవర్తి మహాశయుడు. "కాఫీలూ, టిఫిన్లూ అయ్యాక" అమ్మాయిని పిల్చుక వచ్చారు ఆడవాళ్ళు...

నాకు ముచ్చెమటలు పట్టేశాయి! సోఫాలోకూర్చున్న నాశరీరం, నాఅదుపు తప్పి, అదురుతూ ఎగిరెగిరి పడుతోంది! నాకు ఉద్యోగంమీద కాదు కదా, జీవితం మీదే తీపి ఎగిరిపోయిందీ క్షణంలో!

పెళ్లికాకుండానే, చిన్నసైజు రోడ్డురోలరులావున్న ఈ అమ్మాయి...పెళ్లయ్యాక... ఒకరిద్దరుపిల్లలు పుట్టాక... ఎలామారుతుంది? "బుల్‌డోజర్‌లా" మారి-నన్నూ నా జీవితాన్నీ, సమూలంగా ఎత్తి, ఏ అగాథంలోనో గిరవాటు వేసేస్తుంది!

"అమ్మాయిని లోపలికి పిల్చి కెళ్లమంటారా? పాటగానివింటారా? చదువును గురించి ప్రశ్నలేవేనా వేస్తారా? మాకేం అభ్యంతరం లేదు..." అంటున్నాడు పిల్లతండ్రి...

"ఒద్దు...ఒద్దు. .ఏమీఅవసరంలేదు.. లోపలికి తీసికెళ్లొచ్చు...ఇంటికివెళ్లి... నాన్నగారిచేతఉత్తరం వ్రాయించేస్తాను" అంటూ బయటపడ్డాను ... పెదాలింకా ఎండిపోయే వున్నాయి...

"త్వరగా వ్రాయించండి...ఈ నెలాఖరులోగా తప్పితే, మరో మూణ్ణెల్ల వరకూ ముహూర్తాలులేవు.'' అన్నాడు పిల్లతండ్రి-ఇక మిగిలివుంది ముహూర్తాలు పెట్టుకోవటమే నన్నంత ఖరోసాతో!

తలాడించి నేరుగా సుబ్రహ్మణ్యం గారింటికేసి వచ్చాను. సుబ్రహ్మణ్యం, రీటా ఇద్దరూ లేరు ఇంటివద్ద. ఉద్యోగాలకు వెళ్లిపోయారు. ఇక రావటం సాయంత్రం ఐదున్నర దాటాకే నని చెప్పాడు నౌకరు కుర్రాడు. ఆపూటంతా, సిటీలో ఒకరిద్దరు మిత్రులను కల్సుకున్నాను "ఉద్యోగం" జపం చేస్తూ. వాళ్ళు స్పష్టంగా చెప్పారు. "ఆకాశగంగనైనా, నేలమీద నడిపించగలం గానీ, ఉద్యోగం...మా వల్లకాదు." అని. ఆ రాత్రి ఏడున్నరకు ట్రెయిన్‌కు తిరిగి వెళ్లాలనుకున్నాను...



సుబ్రహ్మణ్యంతో ఒక్కసారిచర్చించి ఇక నిర్ణయం చేసుకోవాలనుకున్నాను. కారణం హెలెన్‌మీద నాకు చచ్చేంత ప్రేమ ఏమీలేదు. అసలెవరి మీదాలేదు. ఉద్యోగం మీద తప్పిస్తే...

తిరిగి తిరిగి ఇల్లుచేరుకొనేసరికి, ఎవరూ కనిపించలేదు! "మళ్ళీ ఏదేనా సభకు వెళ్లారా మీ అయ్యగారు, అమ్మ గారూ?" అనడిగాను నౌకరు కుర్రాణ్ణి. వాడు బెదిరిపోయినట్లు, అటూ ఇటూ చూచి మెల్లని స్వరాన అన్నాడు "అమ్మ గారింకా ఇంటికిరాలేదు. బహుశా ఏ స్నేహితురాలింటికో వెళ్ళుంటారు... రాత్రికివస్తారు. అయ్యగారు...అదుగో ఆ రూంలో..." అంటూ అటువేపు చూసాడు.

మెల్లిగా రూం దగ్గరకు వెళ్లాను. తలుపులు ఓరగావేసివున్నాయి. నేలమీద

-తలగడా గుండెల క్రింద వేసుకుని, అస్త వ్యస్తంగా బోర్లాపడుకుని వున్నాడు సుబ్రహ్మణ్యం. ప్రక్కనే బాటిల్, గ్లాసూ వున్నాయి. అర్థమయింది. సిటీలలో... చాలామంది కుందీ అలవాటు. అంచేత ఆశ్చర్యం కలగలేదు...కాళ్ళూపటాన్ని బట్టి చూస్తే...ఇంకా కంట్రోల్ తప్పలేదని పించింది

"నేను రాత్రి ట్రెయిన్‌కు వూరికెళ్ళి పోతానండీ;'' అన్నాను మెల్లిగా.

"ఏమిటీ? వెళతారా! వెళ్ళిరండి!" అన్నాడు తలెత్తి నావేపుచూచి. అంతలోనే, చివాలున లేచి కూర్చుని..."జస్టె మినిట్! ఇలా కూర్చో బ్రదర్!'' అన్నాడు...లోపలికివెళ్ళి, అతగాడి క్కాస్త దూరంలో, నేలమీద భాసిం పట్టు వేసు కూర్చున్నాను.

"మీరు జాబ్ గ్యారంటీ ఇస్తే, హెలెన్‌ను చేసుకుంటాను!" అన్నాను మెల్లిగా. ఆ మాటనటానికి నా నాలుక చాలా స్ట్రెయిన్ అయ్యింది.

"ఏమిటీ! హెలెన్‌నుచేసుకుంటావా?" అదిరి పడ్డట్లుగా అరిచాడు...హెలెన్ నంత గాఢంగా ప్రేమిస్తున్నావా?" అన్నాడు మళ్ళీ.

"ఊహూ! ప్రేమంటూ ఎవరిమీదా లేదు...ఉద్యోగం మీదతప్ప!" అన్నాను దృఢంగా...

"వెధవ ఉద్యోగంకోసం... వెధవ జీవితంకోసం ... హెలెన్‌ను పెళ్లిచేసుకుంటావా?" అలాగే అరిచాడు.

"ఉద్యోగమే కాదనుకోండి... ఆదర్శం...కులాంతర వివాహమనే ఆదర్శంకోసం..."అన్నాను మాట తిప్పుకుంటూ. ఒక్కసారిగా ఇల్లెగిరిపోయేలా నవ్వాడు. తాగినమేళం. ఇంతదగ్గరగా ఎప్పుడూ కూర్చోలేదు. నాకు లోలోపల భయంపట్టుకుంది.

నవ్వు గుక్క ఆపుకుంటూ,"ఆదర్శం కోసమా? అసలు ఆదర్శాలన్నవి ఎక్కడున్నాయి బ్రదర్? మనం, మన స్వార్థానికి పూసేరంగుల పేరే ఆదర్శాలు నన్నూ, రీటానూ చూచి మోసపోతున్నావా? నా స్పీచ్ విని "ఇంప్రెస్" అయ్యావా? అది నిన్నటి నాటకం-నటన! మామూలుగా వుంటే, నేను నిజంమాట్లాడను. నిజాలంటే భయం.

నిజాన్ని మర్చిపోవటానికే తాగుతాను. తాగినప్పుడే నిజం అంటే భయం పోతుంది. నిజంచెబుతాను. మా ఇద్దరి దాంపత్యం చూస్తుంటే నీకేమనిపిస్తోంది?" సూటిగా నావేపుచూస్తూ అడిగాడు.

"చాలా అన్యోన్య దాంపత్యం... కులాంతరం అనిపించని..."నా మాట పూర్తికాకుండానే, నావేపు అసహ్యంగా చూచి, చటుక్కున ఏదోగుర్తుకొచ్చిన నాడిలా నౌకరుకుర్రాణ్ణి కేకేశాడు. వాడు రాగానే, అక్కడికి రెండుమైళ్ల దూరాన వున్న "మండీ" నుంచి ఏదో తెమ్మని డబ్బులిచ్చి పంపేశాడు. వెంటనే నావేపు చూచి నవ్వుతూ "సాధారణంగా నా రహస్యాలు ఇతరులకు తెలియటం నాకిష్టం లేదు. చివరకు నౌకరుక్కూడా. అందుకే వాణ్ణి, షుమారు గంట వరకూ ఇటుకేసి రాకుండా, పనిపెట్టి పంపించేశాను."

నేను మాట్లాడలేదు.

"బ్రదర్! మాది ఆదర్శదాంపత్యమనికాదూ అన్నావు. అనుకుంటున్నావు? నిజం నీకే కాదు, ఎవరికీ తెలీదు. మేమిద్దరం ఒకర్నొకరు ద్వేషించుకున్నంతగా బహుశా వన్యమృగాలు కూడా ద్వేషించుకోవేమో!

దట్ డెవిల్ రీటా... నా జీవితాన్ని సర్వనాశనం చేసింది...అసలు మాది ప్రేమవివాహం కాదయ్యా స్వామీ?"

వినాలనిపించలేదు లేవబోయాను... "కూర్చో!" అరిచాడు. తంతాడేమోనని భయంవేసింది. బుద్ధిగా కూర్చున్నాను.

"యౌవన చాపల్యం" అలా అలా తిరగటం అలవాటయ్యింది...రీటాఅక్క రజని ... పక్కా ప్రొఫెషనల్ లేడీ! ఆమెతో అర్థంతెలియని ప్రణయం సాగుతున్న రోజులు...రజని ఇంట్లోనేఉంటూ చదువుకుంటున్న రీటా...తోనూ కాస్తంత చనువు పెంచుకున్నాను... రజని, రీటా, నన్ను గాలంవేసిపట్టారు...రీటా గర్భవతి అయిందని...ఆమెను పెళ్లాడకుంటే నా పరువు గంగలో కలిపేస్తాననీ ...కేకలువేసింది రజని ... అందాకా మనుషుల మనస్తత్వాలు ఆంచనాకట్టడం చేతరానినేను...హడలిపోయాను! రజనే "ఆదర్శం" పేరు సూచించింది. నాకూ మార్గాంతరం తోచలేదు. రీటాను పెళ్లాడి దానికి ఆదర్శపురంగు పులిమేశాను. రజనికికూడా ఈనాటికీ నేనే గార్డియన్‌ను...దబాయించిమరీ పట్టుకెళ్తుంది డబ్బు!

రీటాకు నేనంటే ఏనాడూ ప్రేమలేదు. ఈనాడూలేదు. పైగా నేను పిరికి వెధవనని అసహ్యించుకుంటుంది!

ఇక మా ఇద్దరి ఆహారనియమాలు... రోజూ డైనింగ్ టేబిల్‌దగ్గరరణరంగం. పడకగదిలోయుద్ధం. అయితే మా ఇద్దరి ఒప్పందం ప్రకారం మా తగవు మూడో మనిషికి తెలియకూడదు. తెలియనివ్వం. బయటికి వచ్చినపుడుమాత్రం...ఇద్దరికిద్దరం మహానటులం!

రానురాను మాఇద్దరిలోను ఓవిధమైన విచిత్రమన స్తత్వం ఏర్పడింది. మేమిద్దరమే ఇలా ఎందుకేడ్వాలి? మాలాటి వాళ్లు మరికొందరుంటే...వాళ్లూ ఇలాగే ఏడుస్తుంటే మా కానందం! మా లాటి వాళ్లని చాలామందిని తయారుచెయ్యాలి. అందుకే ఓ పథకం వేసుకొన్నాం. దాని పేరే "ఆదర్శవివాహసంస్థ" దానికో పత్రిక క్షణకాలం ఆగాడుసుబ్రహ్మణ్యం. నా కిదంతా ఏదో క్రైంపిక్చర్‌లావుంది.

"మా ఆశ నిరాశ కాలేదు... చాలా మంది...మావలలో చిక్కారు, ఉద్యోగాల



ఆశతో మరికొందరు వచ్చారు. మొదటి మెరుపు విరిగి, వాస్తవజీవితంలో అడుగెట్టాక...వాళ్లకు ఏడవటానిక్కూడా ఏం మిగలనప్పుడు...మేం విరగబడి నవ్వుకుంటుంటాం... అది హింసాత్మకమైన ఆనందమే కావచ్చు... మామీది మేము చూపుకునే సానుభూతికి పరాకాష్ఠ అదే!

బ్రదర్! ఆదర్శాలు లేవు... అవి భ్రమలు...కులాంతర వివాహాలని నేను ద్వేషించను. ఒద్దని చెప్పను...నిజమైన ప్రేమవుంటే తప్పులేదు...కానీ తప్పని సరి పరిస్థితుల్లో నాలానో... ఉద్యోగం కోసం...నీలానో...చేసుకుని... దానికి ఆదర్శాల రంగువేయటం, ఆదర్శమని భ్రమపడటం మాత్రం వద్దు...

బహుశా ఈ టైంలో, రీటా వుండి వుంటే, నేనివేమీ చెప్పివుండేవాణ్ణికాను.. తాగకున్నా చెప్పలేను...మరి నీయిష్టం. ఏదో నిర్ణయించుకుని ఉత్తరంవ్రాయి...

గబగబ బయటకువచ్చేశాను ... రిక్షాలో వెడుతుంటే రీటాఎదురైంది... "అప్పుడే వెళ్తున్నారా? హెలెన్ను తప్పక మారేజ్ చేసుకోండి..." అంది. తలూపాను.. నాకు ఉక్కిరి బిక్కిరౌతున్నట్లుంది. ఏదో "గని" లోనుంచి బయటకువచ్చినట్లు, విచిత్ర పరిస్థితి.

ఆదర్శాలన్నవి నిజంగా భ్రమలే! సుబ్రహ్మణ్యం అనుభవంప్రకారం ప్రేమ అన్నదీ ఓ భ్రమే! ఏదోకొత్త అనుభవం కోరే శరీరానికి... అందివచ్చిన అవకాశానికీ, మధ్య నడిచే కథే ప్రేమ అనే భ్రమ కావచ్చు.

ఉద్యోగంకోసం హెలెన్మీద ప్రేమ సారీ, భ్రమ ఏర్పరచుకోవాలా? దానిని జీవితాంతం నటించాలా? దానికిఆదర్శాల రంగువేయాలా?

ఏం? ఆలావుఅమ్మాయినిపెళ్ళాడటం ఆదర్శం కాదా? ఎవరూమెచ్చని ఆ అమ్మాయిలావును భరించి జీవితాంతం ఆమెను నేనుద్ధరించగలిగానన్న ఆత్మతృప్తితో బ్రతకనా? బుల్ డోజర్ లా వుందని ద్వేషిస్తానో..ప్రేమిస్తానో... అది నావ్యక్తిగత సంస్కారంమీదఆధారపడి వుంటుంది. కానీ విపరీతమైన ప్రేమకోసం పెళ్లాడానని, ఆదర్శవివాహమనీ జీవితాంతం నన్నునేను వంచించుకొని ఇతరులఎదుటనటించవలసినపనివుండదు. నాకాబోయే మామగారు నాకు ఉద్యోగం తప్పక ఇప్పిస్తానని మాటఇచ్చేశాడు! ఇంకేంకావాలి? ఆదర్శాలప్రసక్తి వస్తే, పైసాకట్నం తీసుకోకుండా పేద

ఇంటిపిల్లను పెళ్ళాడటం ఆదర్శంగాదా? అవకరం అమ్మాయిని చేసుకోవటం ఆదర్శంకాదా? లావు అమ్మాయిని చేపట్టడం ఆదర్శంకాదా?

ఆదర్శాల ముసుగులో ఏ ప్రేమఅనే భ్రమను పెంచి పోషించుకోవాలనుకుంటున్నానో...ఆ భ్రమనే, మనసారా ఆహ్వానిస్తున్నానీ క్షణంలో!

ఊరుచేరగానే, నాన్నగారూ, అమ్మా ఆదుర్దాగా అడిగారు "అమ్మాయి ఎలా వుందిరా? నచ్చిందా?"

"కాస్తలావుఅనిపిస్తుందమ్మా!అయినా నచ్చింది. నేనీఅమ్మాయినే పెళ్ళాడతాను నాన్నగారిని ఉత్తరం వ్రాసెయ్యమని చెప్పు ఉద్యోగంకూడా రెడీగావుందిట."

ఆరోజే నాన్న-నాకాబోయే మామగారికి ముహూర్తాలు పెట్టించమనిఉత్తరం వ్రాసేశారు.

నేనూ ఆరోజే హెలెన్‌కు ఉత్తరం వ్రాశాను.

"త్వరలో...నాపెళ్ళిశుభలేఖ నీకు పంపిస్తాను. నేను నటుణ్ణి కాను. కాలేను. ముఖ్యంగా నిజజీవితంలో నటన నాకిష్టం లేదు...నువ్వు కన్యగా వుండిపోతానంటే అది నీయిష్టం...నాకెలాటి సంబంధమూ లేదు.

నా కాబోయే భార్య చాలా లావు మనిషి. అయితేనేం! ఆమెలో నాకు కోటాను కోట్ల ఆదర్శాలకు "మూలం" కనిపించింది... భ్రమను ప్రేమ అని నామకరణం చేయలేను... నేను పిరికి వాణ్ణే..."

అని. బహుశా హెలెన్ ఆ ఉత్తరం చింపి ముక్కలుచేసేసి, "ఛీ! పిరికి వాడు...ఎంతభ్రమపడ్డాను?" అనిఈసడించుకుంటుందేమో! లేకతిక్కకోపంలో వాళ్ళబావని పెళ్లాడేస్తుందేమో!

